# మాగ్నమ్ ఓపస్

మధ్యాహ్నం పన్నెండు గంటలకి 'పోస్ట్' అన్నకేక వినబడగానే రాంబాబు తలుపులు తెరుచుకొని బయటకు వచ్చాడు. ఎదురు ఇంట్లో సుబ్బారావు దగ్గరకు పోస్ట్‌మాన్ వెళ్ళాడు. రాంబాబు కూడా రోడ్డు దాటి సుబ్బారావు ఇంట్లోకి వెళ్ళాడు. సుబ్బారావు పాత కాగితాలు కొనే పనిలో వున్నాడు. ఒక్క తక్కెడలో నాలుగు కిలోల దాకా కాగితాలు వున్నాయి. రెండవ దాంట్లో మూడు కిలోల రాయి వుంది. ముగ్గు రాయి వైపే చూపిస్తోంది. "వంద గ్రాముల్లో ఏముందిలెండి, కాగితం ధర బత్తిగా తగ్గిపోయింది" అంటూ ఎదురుగావున్న మనిషి చేతుల్లో ఎనిమిది రూపాయల యనలభై పైసలు పెట్టాడు. రాంబాబు వంక చూసి చిరునవ్వు నవ్వాడు.

"నీది ధర్మకాటాయేనా?" అని రాంబాబు అడిగాడు. సుబ్బారావు తడుముకోకుండా "అందుకు సందేహమా?" అని అంటూ ఒక నలిగిపోయిన పత్రిక రాంబాబుకు యిస్తూ "దీంట్లో మీ కథ చదివాను, చాలా బాగుంది" అని అన్నాడు. కథ పేరు శీలవతి.

పోస్ట్‌మాన్ దగ్గిర ఉత్తరాలు తీసుకొని ఇంటికి బయలుదేరాడు.

"ఈవేళ ఆఫీసుకు వెళ్ళలేదా" అని సుబ్బారావు అడిగాడు.

"సెలవు పెట్టాను."

"మీకీ రోజున టౌన్ హాలులో సన్మానం చేస్తారు గదా!"

"అవును. సాయంకాలం ఆరు గంటలకి."

ఇంటికి వచ్చి ఒక్కొక్క ఉత్తరమే చదవడం మొదలుపెట్టాడు.

"విడుదలైన మొదటివారంలోనే మన దగ్గరున్న కాపీలన్నీ పదివేలకు పైచిలుకు అమ్ముడుపోయాయి. రెండవ ఎడిషన్ ప్రెస్‌కు వెళ్లింది. రాయల్టీ చెక్కు దీంతో జతపరిచి పంపుతున్నాను. ఇటువంటి హాట్ నవల రాసి మాకు పంపించవలసింది. మీ క్రొత్త నవల కోసం ఎదురు చూస్తూ వుంటాను.

నమస్కారములతో,

పబ్లిషరు"

"ఈ తరం పాఠకులకి మీ నవల 'శీలవతి' ఒక విప్లవాన్ని తీసుకుని వచ్చింది. ఫార్ములా కథలతో, ఫ్యామిలీ స్టోరీసుతో విసుగెత్తిన మాకు యీ నవల ఒక నూతన

సందేశాన్ని తీసుకువచ్చింది. ఈ మధ్యకాలంలో యిటువంటి నవల రావటం ఇదే మొదటిసారి. మీ కలం నుంచి పుంఖాను పుంఖాలుగా యిటువంటి రచనలు ఇబ్బడి ముబ్బడిగా రావలసిందని, వస్తాయని ఆశిస్తున్నాం.''

ఒక అభిమాన పాఠకురాలు, వారి కుటుంబంలో మరి ఆరుగురు సభ్యులు.

"స్త్రీలు-శీలము'' వంటి ఇక్ష్వాకుల నాటి సమస్యని గురించి యీనాటికవి రాంబాబు ఎందుకు ఇంత శ్రమపడి రాశాడో మాకు అర్థం కావడంలేదు.

శీలవతి కథలో - రాజప్రాసాదాలలో దర్జాగా, డాబుగా విహరించే కవి బజారుపాలయ్యాడు. తను అందల మెక్కి కూర్చున్నా తనలోని బుద్ధి యింకా బురదలోనే వుందని యీ నవల ద్వారా ఋజువు చేసుకున్నాడు.

"కామెర్లవాడికి ప్రపంచమంతా పచ్చగానే కనిపిస్తుందట. భ్రష్టులైన రచయితలకి ప్రపంచమంతా భ్రష్టులుగానే కనిపించవచ్చు. కుటుంబంలోని అందరు వ్యక్తులు, ముఖ్యంగా వివాహం కాని ఆడపిల్లలు, సంసార స్త్రీలు చదువుకునే మన పత్రికలలో యిటువంటి రచనలు ప్రచురించటం మానవ సంఘానికి పాఠకలోకానికి తీరని అవమానం. శీలవతి నవలను వెంటనే బహిష్కరించాలి. అన్ని కాపీలు నడివీధిలో గుట్టలుగా పోసి తగుల పెట్టాలి.''

"శీలవతి నవల రాంబాబు గారి "మాగ్నమ్ ఓపస్''. ప్రతి పాఠకుడు జీవితాన్ని ఒక నూతన కోణం నుంచి చూడటానికి యీ నవల సహకరిస్తుంది. రచయితకు మా జోహారులు.''

"శీలవతి నవల చదివాక మా నగరంలోని సాహితీ సభ్యులం ఏకగ్రీవంగా ఒక తీర్మానానికి వచ్చాం. రచయిత రాంబాబు గారికి తగు రీతిని సన్మానం చెయ్యాలని ఈ కార్యక్రమం జయప్రదం చెయ్యటానికి గాను సాహితీ ప్రియు లందరూ తమ పాత చెప్పులని మాకు పంపించమని అర్థిస్తున్నాం.''

"మా యిద్దరి జీవితాల విషాదగాధను 'శీలవతి' ద్వారా అందరికీ తెలియపరిచి మా బ్రతుకు నగబాట్లు చేసినందుకుగాను నష్టపరిహారానికి గాను నీమీద లక్షరూపాయలకు దావా వెయ్యటానికి నిశ్చయించుకున్నాము.''

"ఎన్నో ఉత్తమ కథలని, నవలలు రచించిన రాంబాబు గ్రంథ చౌర్యం లాంటి నీచానికి పాలుపడడం చాలా శోచనీయం. దిగజారిపోయిన యీ రచయితని మనమంతా వెలివేసి బహిష్కరించాలి.''

"సాహిత్యంలో ఎన్నో నూతన ప్రయోగాలు ప్రక్రియలు చేసిన మీ శీలవతి యీనాటి నవలా సాహిత్యానికే మకుటం? 'అభినవ నవలా చక్రవర్తి' అని మీకు బిరుదు నిస్తున్నాం. చక్రవర్తి జిందాబాద్!!

ఆ ఉత్తరాలన్నీ బీరువాలో దాచిపెడుతూ రాంబాబు పెద్ద పెట్టున నవ్వుకున్నాడు.

క్రితం ఇరవై సంవత్సరాలుగా రాంబాబు కథలు, నవలలు రాస్తూనే వున్నాడు. పాఠకలోకం యీనాటివరకూ నిర్లక్ష్యం, నిర్లిప్తంగానే వుంది.

ఒకరిద్దరు హితచింతకులు చెప్పనే చెప్పారుకూడాను. ఇది ప్రజాస్వామ్య యుగం. ప్రజలు కోరేది మనం రాయాలి. అంతేకాని నువ్వు బహుభాషా ప్రవీణుడినని చాటుకున్నంత మాత్రాన ఏం లాభం లేదు.

ఈనాటి సమస్యలని యీనాటి ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి. వాళ్లకు నచ్చేటట్టు పరిష్కరించాలి.

గాలిలో విహరించడానికి ఇవి కవిత్రయం రోజులుకావు. రియలిస్టిక్ సాహిత్యపు రోజులు!!

ఒక విప్లవ కవి యిలా సలహా యిచ్చాడు:

"గతంలోకి చూస్తు నిలబడ్డావా!

మరణిస్తావు.

కాలంతోపాటు ముందుకు నడిచావా

కలకాలం శాశ్వితంగా వుంటావు."

కాని ప్రజల సమస్యలేమిటో తనకు అర్థం కాలేదు. ఒక మాట చెప్పవలసి వస్తే తను యీ సమస్యలని ప్రత్యక్షంగా అనుభవించలేదు. ఇంతకాలం ఒక ప్రేక్షకుడుగానే గడిపాడు.

తను శ్రీమంతులైన పండితుల ఇంట్లో పుట్టాడు.

ఎటు చూసినా కలిమి!

ఎటు చూసినా తరతరాల నుంచి వచ్చిన సంస్కారం. కోరిన విద్యను అభ్యసించాడు.

వలచిన కాంతను చేపట్టాడు.

నచ్చిన ఉద్యోగంలో చేరాడు.

జీవితం మూడుపువ్వులు ఆరుకాయలుగా గడిచిపోతోంది. పదవి పెరిగింది. సంపద పెరిగింది- పలుకుబడి పెరిగింది.

కాని నివురుగప్పిన నిప్పులా అర్థం కానిది ఏదో అసంతృప్తి మనస్సు మారుమూల తల ఎత్తింది.

ఈ జీవన యాత్రకు అర్థం ఏమిటి? యాభై సంవత్సరాలుగా తను సాధించిన లక్ష్యమేమిటి?

సమాధానం శూన్యం!

ఒక్కొక్కసారి అనిపించేది, ఈ అమృతం ప్రతిరోజు తాగలేను.

అంతులేని ఈ తీపిని భరించలేను. రవ్వంత చేదును కూడా చవి చూడాలి.

ఒక్కసారన్నా బురదలో దిగి కాళ్ళు కడుక్కోవాలి.

ఈ నిరంతర జిజ్ఞాస ఫలితమే ఆనాడు తను చేసిన మొదటి రచన.

ఇరవై మూడు పత్రికలు తిరస్కరించిన యీ కథ యిరవైనాలుగో పత్రికలో మారుమూల ప్రచురణమైంది.

పాఠకులలో విప్లవం రాలేదు.

సాహిత్యలోకంలో ప్రళయం రాలేదు.

చదివిన ఒకరిద్దరు ఫరవాలేదు అని అన్నారు. ఇంకొక ఇద్దరు ముగ్గురు బాగుంది అని అన్నారు.

ఆ మూడు అక్షరాలే తన రచనా వ్యాసంగానికి నాంది అయింది.

ఈ కావ్య సృష్టిలో తనలో ఏదో ఆనందం. హృదయమంతా శాంతితో నిండిపోయింది. మళ్ళీ కొద్దిరోజులకే ఈ అశాంతి, నిరాశ మనస్సుని కప్పివేసి కలవరపరిచేవి.

ఫలితం?

ఇంకొక రచన వెలువడేది.

చూస్తుండగానే ఇరవై సంవత్సరాలు గడచిపోయాయి. తనకు రచయిత అనే పేరు వచ్చింది. కాని సాహిత్య ఆకాశంలో తను లక్షలాది నక్షత్రాలలో మిణుకు మిణుకుమనే ఒక చిన్న తారగా నిలిచిపోయాడు.

కావాలని చూస్తేనే కాని తను ఇతరులకి కనిపించటం లేదు.

కాని తన కళ్ళ ముందు అక్షరాభ్యాసం చేసినవాళ్ళు మాత్రం రచయితలుగా, కథకులుగా, కవులుగా- ఆకాశమంతా ధూమకేతువులులాగా ప్రపంచకాన్ని వెలుగుతో నింపివేస్తు వుంటే ప్రజలంతా వెయ్యికళ్ళతో వాళ్ళ రచనల కోసం ఎదురు చూస్తూ వుంటే- వారి ఆధిక్యత ఏమిటి? తన లోపం ఏమిటో అర్థమయ్యేదికాదు.

ఇద్దరు ముగ్గురు అమాయకంగానే అడిగారు.

"మీరు రేడియోకి, సినిమాలకి రాయరేం? నిన్నగాక మొన్న వచ్చిన వాళ్ళంతా బోలెడంత డబ్బు సంపాదిస్తున్నారు."

"నాకు చాతకాదు" అని రాంబాబు సమాధానం చెప్పాడు.

"అదేమంత బ్రహ్మవిద్యకాదు. అందరికీ తెలిసిన సమస్యలని అందరికీ అర్థమయ్యే భాషలో రాయండి. సమస్యలని సింపిల్ భాషలో పరిష్కరించండి. నీ వీలైనంత వరకూ కథలను సుఖాంతం చెయ్యండి. మెట ఫిజిక్సు- మిస్టిసిజమ్- ఛాయావాదాం- ఎక్సుస్టెంజలిమ్ అంటూ రాయక ప్రజలని కన్‌ఫ్యూజ్ చేసి తికమక పెట్టకండి.

ఇది డెమోక్రసీ కాలం. నలుగురితోపాటు నారాయణా!

'బాలాదపి సుభాషితం' అన్నారు. రాంబాబుకి యీ సలహా బాగా నచ్చింది.

దాని ఫలితమే 'శీలవతి' నవల. తను ఆ నవలలో చేసిన పనల్లా ఒకటే. నిజాన్ని నిజంలాగా చెప్పటం కథలోకాని- శైలిలో కాని ఎటువంటి కాంప్రమైజు లేకుండా అంతా బట్టబయలుగా చెప్పడం. నవల సీరియల్‌గా ప్రచురణ పొంది పుస్తక రూపంగా వచ్చింది.

అందరూ తన రచనని గుర్తించారు. పాఠకలోకం తన వంక ఆశ్చర్యంగా చూసింది.

తన రచనలని గురించి ఇంతవరకూ విమర్శించని తండ్రి ఒకటే మాట అన్నాడు.

"కాళిదాసు గొప్పవాడు అయింది అభిజ్ఞాన శాకుంతలమ్! మేఘసందేశం వల్ల- అంతేకాని లంబోధర ప్రహసనం వల్ల కాదు. ఏదన్నా పని చేసే ముందు వంశమర్యాద గుర్తు తెచ్చుకో."

ఇంతకాలం తనతో కాపురం చేస్తున్న ఇల్లాలు ఒకటే మాట అన్నది. "మీరు ఇటువంటి పుస్తకాలు రాస్తే నేను నుయ్యో, గొయ్యో చూసుకుంటాను!"

కాలేజీలో చదువుకుంటున్న కూతురు ఏడుస్తూ ఇంటికి వచ్చింది. "కాలేజీలో మగపిల్లలంతా నీ పుస్తకం పేరు పెట్టి నన్ను వెక్కిరిస్తున్నారు."

పై అధికారి పిలిచి వార్నింగ్ ఇచ్చాడు. ప్రోనోగ్రఫీ రాసేవాళ్లంటే నాకు చాలా అసహ్యం... అటువంటి వాళ్ళు మా ఆఫీసులో వుంటం నాకు ఇష్టం లేదు. ఉద్యోగం ముఖ్యమనుకుంటే ఇటువంటి పనులు మళ్లీ చెయ్యవద్దు.

ఆ క్షణంలో వంద సంవత్సరాలు ఎదిగాడు. రాంబాబు మనస్సులో నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఒకే మాట పదే పదే వినబడసాగింది.

శాంతిః మనశ్శాంతిః

ఆరోజు సాయంకాలం సన్మాన సభలో మాట్లాడుతూ మహాకవి రాంబాబు తన ఉపన్యాసం యిలా ముగించాడు.

"ఆల్విన్ టాఫ్లర్ చెప్పినట్లు కాలం, నాగరికత మనం ఊహించిన దాని కంటే- మనం ఆశించిన దానికంటే అమిత వేగంతో పరుగెత్తుకునిపోతున్నాయి.

నిన్నటి నిజం- నేటి అసత్యం, రేపటి అభూత కల్పనగా మారిపోతూ నిన్నటి తప్పు యీనాటి ఒప్పై రేపటికి వాళ్ళ మూఢాచారమై నాగరికత మనోవేగం కన్న వేగంగా మారిపోతున్న యీ కంప్యూటర్ యుగంలో కూడా,

మారక- మారలేక నిలిచిపోతున్నవి అనాదిగా వస్తు మానవజాతిలోనే ఉద్భవించిన అరిషడ్వర్గాలు ఆనాడు యీనాడు అల్లాగనే స్థిరంగా వున్నాయి. నాగరికత పెరిగిన కొద్దీ మనం- శాశ్వతాన్ని దూరం చేసుకుని క్షణికం కోసం ప్రాకులాడుతున్నాం.

మానవుడి బానిసత్వం మాత్రం పోవడం లేదు.

బాధ్యతలకు బానిసత్వం!!

కోరికలుకు బానిసత్వం!!

కష్టాలకు బానిసత్వం!!

అందుకనే మనస్సుకు పదేపదే అనిపిస్తోంది. ఇహం మరచి పరం గురించి ఆలోచించవలసిన సమయం ఆసన్నమైనదని.

తాత్కాలికాన్ని విస్మరించి శాశ్వతాన్ని స్మరిద్దామని... జీవితాన్ని చింతనలో, జిజ్ఞాసలో- మననలో గడుపుదామని ధృడనిశ్చయం మనస్సులో ఏర్పడింది. జ్ఞానార్థిగా మీ ముందుకు ఇహ పదే పదే నేను రావచ్చును. కాని ఇహ రచయితగా మీ ముందుకు రాను. ఏ రచనలు చెయ్యను.

జైహింద్."